క్లుప్తంగా

ఏఎన్ఎం పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

కోడేరు: మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ బాలికల హాస్టల్‌లో ఏఎన్ఎం పోస్టు ఖాళీగా ఉందని అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ భాస్కర్‌శర్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియేట్, ఏఎన్ఎం కోర్సు సర్టిఫికెట్ కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 23 నుంచి 25వరకు ఎమ్మార్సీ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలని కోరారు.

నాన్ టీచింగ్ పోస్టులకు..

నాగర్‌కర్నూల్‌రూరల్: వెల్దండ మండలం పుల్జాలలో ఏర్పాటు చేసిన ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ పాఠశాలలో ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రాంతీయ సమన్వయ అధికారి కల్యాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళా విభాగంలో హాస్టల్‌వార్డెన్, పురుషుల విభాగం ఎలక్ట్రీషన్, ప్లంబర్, అసిస్టెంట్ క్లర్క్, కిచెన్ హెల్పర్, రెండోనాన్ టీచింగ్ పోస్టులకుగాను అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసేందుకు ఈ నెల 23వ తేదీ నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వ్యవసాయ కమిషన్ సభ్యుడికి సన్మానం

వంగూరు: ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన వ్యవసాయ కమిషన్ కమిటీలో సభ్యుడిగా వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కేవీఎన్ రెడ్డిని నియమించారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లోని అంబేడ్కర్ భవన్‌లో వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డితో పాటు కేవీఎన్‌రెడ్డిని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పండిత్‌రావు, ప్రచార కమిటీ సభ్యులు పాండురంగారెడ్డి, రమేష్‌గౌడ్, బీకే కృష్ణారెడ్డి, అశోక్‌రెడ్డి తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు.

కేసు నమోదు

బల్మూర్: మాయమాటలతో మహిళను లోబర్చుకొని గర్భిణీని చేసిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదైంది. హెడ్‌కానిస్టేబుల్ చాంద్‌పాషా తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని జినుకుంట గ్రామానికి చెందిన వివాహితను అదే గ్రామానికి చెందిన శివ నమ్మించి గర్భిణీని చేశారు. ఆగస్టు నెలలో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. సోమవారం జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో ఎస్పీ ఆదేశాల మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

జిల్లా ప్రధాన కార్యదర్శిగా దారసుందర్

కల్వకుర్తి టౌన్: ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కల్వకుర్తి డిపోకు చెందిన కండక్టర్ దార సుందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం ఉమ్మడి జిల్లా మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన సంఘం సమావేశంలో ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. వరుసగా మూడోసారి తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవటంపై రాష్ట్ర సంఘానికి, తోటి ఉద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు.

పోస్టర్ విడుదల

కల్వకుర్తిరూరల్: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం నవంబర్ 23న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ధర్మాగ్రహ దీక్ష చేపడుతునట్లు తపస్ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు పర్వతాలు, జిల్లా కార్యవర్గ సభ్యులు నర్సిరెడ్డి, జైపాల్‌రెడ్డిలు తెలిపారు. మంగళవారం పట్టణంలో చలో ఇందిరాపార్క్ పోస్టర్లను వారు విడుదల చేశారు. ఉపాధ్యాయులు హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్యార్మీ



కల్వకుర్తి టౌన్/కల్వకుర్తిరూరల్: పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో గ్యార్మీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మంగళవారం జేఏస్ యూత్ ఆధ్వర్యంలో పట్టణంలోని కూరగాయల మార్కెట్ నుంచి సుభానీ దర్గా వరకు ర్యాలీ నిర్వహించారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం కాలనీలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ సత్యం పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షాహెద్, కౌన్సిలర్లు ఎజాస్, కల్వకుర్తి సీఐ నాగార్జున, ఎస్ఐ మాధవరెడ్డి, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్, జేఏస్ యూత్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

పత్తికి మద్దతు ధర కల్పించాలి

తాడూరు: పత్తికి మద్దతు ధర కల్పించాలని కోరుతూ మంగళవారం మండలానికి చెందిన ఇంటర్‌నేషనల్ హ్యూమెన్‌రైట్స్ వ్యవసాయ విభాగం జిల్లా అధ్యక్షుడు సాల్వాచారి, ఉపాధ్యక్షుడు బాలు మండల కేంద్రంలో ఏఓ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ప్రభుత్వమే నేరుగా పత్తిని కొనుగోలు చేయాలని కోరారు. కార్యక్రమంలో హ్యూమెన్ రైట్స్ వ్యవసాయ సంఘం నాయకులు శ్యాం, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



వెల్దండలో కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎంపీ మల్లురవి

వెల్దండ: నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎంపీ మల్లు రవి పేర్కొన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ నిర్వహించే సమావేశానికి వెళ్తున్న ఎంపీ మల్లురవి మార్గమధ్యలో మండల కేంద్రంలోని కార్యకర్తలతో మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని సూచించారు. అనంతరం మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎంపీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సేవాదల్ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్రశ్రీను ముదిరాజ్, నాయకులు నాగేశ్వర్‌గౌడు, కిష్టాల్, తదితరులు ఉన్నారు.

కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాలలో పోస్టాఫీస్ భవనం నిర్మించాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులు ఎంపీ మల్లురవికి కార్యకర్తలు వినతి పత్రం అందజేశారు. గగ్గలపల్లిలో ఎంపీని మర్యాదపూర్వకంగా కలిశారు. నిజామోద్దిన్, జలాల్, యాదయ్య ఉన్నారు.

పశుసంపదను కాపాడుకుందాం

చారకొండ: పశుసంపదను కాపాడుకుందామని మండల పశువైద్యాధికారి షేక్ మదర్ అన్నారు. మండలంలోని తుర్కపల్లి, బొమ్మల గుడిసేలు గ్రామాల్లో మంగళవారం పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పశువులకు టీకాలు వేయించాలని కోరారు. మండలంలోని రైతులకు సబ్సిడీపై పశుగ్రాసం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వారి వెంట పశువైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలో చేపడుతున్న అభివృద్ధి పనులలో పూర్తి నాణ్యతను పాటించాలని మున్సిపల్ చైర్మన్ సత్యం కోరారు. మంగళవారం మున్సిపాలిటీలోని 18వ వార్డులో నిర్మాణం చేస్తున్న రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్లకు సూచించారు. ఆయన వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ షాహెద్, కాలనీవాసులు యాదయ్య, షకీల్, శేఖర్, శ్రీను ఉన్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



ఉప్పునుంతల: అచ్చంపేటలో కొనసాగుతున్న మండలంలోని వెల్టూరు మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాలలో మంగళవారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జలుబు, అలర్జీ, జ్వర పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యాధికారిణి స్వప్న విద్యార్థులకు సూచించారు. వర్షాలు పడుతున్నందున సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు ప్రభావతి, నవ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

హమాలీల హక్కుల కోసం ఐక్యంగా పోరాడుదాం

నాగర్‌కర్నూల్‌రూరల్: హమాలీల హక్కుల కోసం ఐక్యంగా పోరాడుదామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు డి ఈశ్వర్ పిలుపునిచ్చారు. మంగళవారం హమాలీ యూనియన్ జిల్లా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు అడ్డాలు, ఉపాధి భవనాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆర్ శ్రీనివాసులు, నాయకులు అశోక్, మల్లయ్య, వెంకటయ్య, ఆంజనేయులు, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

బంగారం, నగదు చోరీ: కేసు నమోదు

తెలకపల్లి: మండలంలోని రాకొండలో ఓ ఇంట్లో చోరీ ఘటనలో మంగళవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రాకొండ గ్రామానికి చెందిన కొట్టె మల్లయ్య మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో ఇంటికి తాళం వేసి కూరగాయల కోసం వెల్లాడు. గంట సమయం తర్వాత ఇంటికి రాగా అప్పటికే తాళం విరగొట్టి ఉండటంతో దొంగతనం అయినట్లు భావించి ఇంట్లో చూడగా రూ.15 వేల నగదు, బీరువాలో ఉన్న రెండు మాసాల బంగారు కమ్మలు చోరీ అయినట్లు గుర్తించాడు. బాధితుడు మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఎన్మన్‌బెట్ల వాసికి డాక్టరేట్



కొల్లాపూర్: మండలంలోని ఎన్మన్‌బెట్ల గ్రామానికి చెందిన ఎం.ఉదయ్‌కుమార్‌కు డాక్టరేట్ దక్కింది. వృక్షశాస్త్రంలో తమిళనాడులోని స్థానీయ జాతులు అనే అంశంపై చేసిన పరిశోధనలకు గాను ఆయనకు డాక్టరేట్ లభించింది. మధురై కళాశాలకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ కరుప్ప స్వామి పర్యవేక్షణలో ఆయన పరిశోధనలు చేశారు. మంగళవారం కామరాజ యూనివర్సిటీలో తమిళనాడు గవర్నర్ తిరు.ఆర్.ఎన్.రవి చేతులమీదుగా ఆయన డాక్టరేట్‌ను అందుకున్నారు. ఉదయ్‌కుమార్‌కు డాక్టరేట్ లభించడంపై గ్రామస్తులు సురేందర్ రావు, భాస్కర్‌గౌడ్, సత్యనారాయణ, శంకర్‌గౌడ్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు దెంది రాజారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పలు పాఠశాలలతో పాటు బిజినేపల్లి మండలం పాలెంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. పెండింగ్ డీఏలను, పీఆర్‌సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ జిల్లా బాధ్యులు, మండల అధ్యక్షుడు భాస్కర్ గౌడ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన

తాడూరు: మండల కేంద్రంతోపాటు పలు ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో భోజన సమయం విరామ సమయంలో ఉపాధ్యాయులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టారు. డీఏలు, పీఆర్సీ, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

దెబ్బతిన్న పంటలను పరిశీలించిన ఏఓ



కొల్లాపూర్: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను మండల వ్యవసాయ అధికారి చిన్నహుస్సేన్ యాదవ్ పరిశీలించారు. మంగళవారం ఆయన వరిదేల శివారు ప్రాంతంలో పర్యటించారు. వరిపైరును, దెబ్బతిన్న మొక్కజొన్న, కంది పంటలను ఆయన పరిశీలించారు. పంటనష్టం వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. పంటలను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. ఆయన వెంట ఏఈఓ.కేతూరి సూర్యతేజ తదితరులు ఉన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

వెల్దండ: మండలంలోని చెర్కూర్ గ్రామానికి చెందిన నూకం వెంకటయ్యముదిరాజ్ నాగర్‌కర్నూల్ జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా వివిధ సేవలకు గుర్తింపుగా సేవారత్న పురస్కార్ అవార్డు దక్కింది. ఈమేరకు మంగళవారం హైదరాబాదులో నిర్వహించిన సమావేశంలో తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ అవార్డు అందజేశారు.

అంతర్జాతీయ స్థాయిలో వాసవీ క్లబ్ సేవలు



మాట్లాడుతున్న ప్రకాష్

కల్వకుర్తిరూరల్: వాసవీ క్లబ్ ఇంటర్‌నేషనల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో సామాజిక సేవలు అందిస్తున్నామని ఆ క్లబ్ జాయింట్ సెక్రెటరీ పుల్లూరి ప్రకాష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయంలో రీజియన్ చైర్మన్ సత్యనారాయణ అధ్యక్షతన జూలూరి రీజియన్ కాన్ఫరెన్స్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. సమాజంలోని విభిన్న వర్గాలకు ఎన్నో సామాజిక సేవలు అందిస్తున్న ఏకైక సంస్థ వాసవీ క్లబ్ అని పేర్కొన్నారు. దాదాపు రూ.200 కోట్లతో ప్రపంచవ్యాప్తంగా సామాజిక సేవలు నిర్వహించినట్లు వివరించారు. వివిధ సేవలు అందించిన క్లబ్‌లకు బహుమతులను, మెమోంటోలను అందజేశారు. సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జూలూరి రమేష్‌బాబు, అడిషనల్ ట్రెజరర్ హరికృష్ణ, గవర్నర్ జగదీశ్వర్‌గుప్తా, విశ్వనాథం, శ్రీనివాసులు, కల్మిచర్ల రమేష్, శివజగదీశ్వర్, కల్మిచర్ల గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కొమురం భీం జయంతి



కొల్లాపూర్: పట్టణంలోని ప్రభుత్వ పీజీ కళాశాలలో కొమురం భీం జయంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి బి.దాసు తో పలువురు విద్యార్థులు కొమురం భీం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగం పోరాటంలో కొమురం భీం పాత్ర ఎనలేనిదన్నారు. కార్యక్రమంలో మహేష్, రాము, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఆర్డీఓకు వినతి

కల్వకుర్తిరూరల్: పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని భారతీయ కిసాన్‌సంఘ్ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు అంజన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డిలు మాట్లాడుతూ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో దళారులకు పత్తిని తక్కువ ధరకు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. అధిక వర్షాలకు పత్తి దిగుబడి తగ్గడంతోపాటు మద్దతు ధర రాక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని వివరించారు. పత్తిరైతులను ఆదుకోవాలని విన్నవించారు. రైతులు, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల అస్వస్థతపై ఆరా

బిజినేపల్లి: మండలంలోని శాయిన్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో ఫుడ్ పాయిజన్ కారణంగా 10 విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం విధితమే. మంగళవారం ఎంఈఓ రఘునందన్‌రావు పాఠశాలకు చేరుకొని విద్యార్థులను పరామర్శించారు. అస్వస్థతకు గల కారణాలను బిజినేపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి శివకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయ, వంట కార్మికులతో సమావేశమై విద్యార్థులకు అందించే భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఏదైన సమస్య ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా బోధనపై ప్రత్యేక శ్రద్ధ

ఉప్పునుంతల: విద్యా బోధనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని మండల విద్యాశాఖాధికారి చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని అయ్యవారిపల్లి, వెల్టూరు ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యార్థుల విద్యా ప్రగతిని పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్లను తనిఖీ చేశారు. విద్యార్థుల సంఖ్యను పెంచడానికి కృషిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పాఠశాలల బలోపేతానికి గ్రామస్తుల, ప్రజాప్రతినిధులు, యువకుల సహకారం తీసుకోవాలని సూచించారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ



వెల్దండ: మండలంలోని కొట్ర, కొట్ర ఉన్నత పాఠశాల, పోతేపల్లి, లింగారెడ్డిపల్లి గ్రామాల్లో పాఠశాలలను మంగళవారం ఇన్‌చార్జ్ ఎంఈఓ చంద్రుడు సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. నూతన పద్ధతిలో విద్యార్థులకు పాఠాలు బోధించాలన్నారు. భోజనం పరిశీలించి సలహాలు, సూచనలు చేశారు. ఆయన వెంట సీఆర్‌పీలు చంద్రశేఖర్, ఆంజనేయులు, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

మాజీ ఎంపీపీ పరామర్శ

కోడేరు: మండల కేంద్రానికి చెందిన ఎండీ నయీం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ కొత్త రామ్మోహన్‌రావు ఆస్పత్రిలో ఆయనను పరామర్శించారు. మెరుగైన సేవలు అందించాలని వైద్య సిబ్బందిని కోరారు. కార్యక్రమంలో సురేష్‌యాదవ్, నిరంజన్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన



నాగర్‌కర్నూల్‌రూరల్: స్థానిక లహరీ గార్డెన్‌లో సోమవారం రాత్రి పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా కందనూలు కళామండలి ఆధ్వర్యంలో ప్రదర్శించిన సత్యహరిశ్చంద్ర నాటకం చూపరులను ఆకట్టుకున్నది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గైక్వాడ్ రఘునందన్ పాల్గొని నాటకంలో పాల్గొన్న కళాకారులను సన్మానించారు. కార్యక్రమంలో కందనూలు కళామండలి సభ్యులు నర్సింహారెడ్డి, దినకర్, కళాకారులు పాల్గొన్నారు.

బీఎస్పీ బలోపేతానికి కృషి

నాగర్‌కర్నూల్‌రూరల్: బీఎస్పీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్ అన్నారు. మంగళవారం బీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గ స్థాయి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రూప్–1 పరీక్షలో ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 29ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కొమరంభీం 84వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అసెంబ్లీ ఇన్‌చార్జ్ కొత్తపల్లి కుమార్, అధ్యక్షుడు చింతకుంట కల్యాణ్, ఉపాధ్యక్షుడిగా ఎర్రోళ్ల పరశురాం తదితరులను ఎంపిక చేశారు. నాయకులు పృథ్వీరాజ్, బర్ల రాజు, పానుగంటి రాంచందర్, శేఖర్, శ్రీను, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని నూతన తహసీల్దార్ ఆవరణంలో మహాత్మాగాంధీ విగ్రహ ఏర్పాటుకు వాసవీ క్లబ్ జిల్లా గవర్నర్ తిలకంటి జగదీశ్ గుప్తా, వాసవీ క్లబ్ మండల అధ్యక్షుడు చంద్రమౌళి మంగళవారం భూమిపూజ చేశారు. అంతకముందు సాతాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్స్, నోట్‌బుక్కులు అందజేశారు. అదే విధంగా కుట్టు మిషన్‌ను వితరణగా ఇచ్చారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలకు గడియారం అందజేశారు.

హెచ్ఐవీపై అవగాహన



తెలకపల్లి: మండలంలోని రాకొండ కస్తూర్బా పాఠశాలలో ఇంటర్మీడియేట్ విద్యార్థినులకు మంగళవారం హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైఆర్‌జీకేర్ స్వచ్ఛంద సంస్థ లింక్ వర్కర్స్ స్కీం ప్రోగ్రాం సీఎల్‌డబ్ల్యూ హేమలత మాట్లాడుతూ హెచ్ఐవీ వ్యాధి ప్రమాదకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ పాఠశాల ప్రిన్సిపాల్ హసీన్న, ఉపాధ్యాయులు లక్ష్మి, స్వాతి, జ్యోతి, రేణుక, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

వెల్దండ: మండలంలోని భర్కత్‌పల్లి గ్రామానికి చెందిన రాములు అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం మాజీ వైస్ ఎంపీపీ శాంతిగోపాల్‌నాయక్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు.

పారదర్శకంగా నియామకాలు చేపట్టాలి



తెలకపల్లి: మండలంలోని రాకొండ కస్తూర్బాగాంధీ పాఠశాలలో ఖాళీగా ఉన్న అటెండర్, స్కావెంజర్ పోస్టులను పారదర్శకంగా భర్తీ చేయాలని మంగళవారం జిల్లా స్వేరోస్ నాయకులు ఎంఈఓ కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. జిల్లా స్వేరోస్ ప్రధాన కార్యదర్శి రెడ్డపాకుల శివశంకర్, మబ్బురాము, సంపత్‌కుమార్, రాకేష్, భాస్కర్, కృపావరం, చింటు తదితరులు పాల్గొన్నారు.

ఆముదం సాగుపై శిక్షణ

బిజినేపల్లి: మండలంలోని పాలెం కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం ఆముదం సాగుపై రైతులకు మంగళవారం శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. తిమ్మాజిపేట, చేగుంట, పర్వతాపూర్ గ్రామాలకు చెందిన రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాలెం కేవీకే కో–ఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నూనె గింజ పంటల సాగు, లాభాలు, యాజమాన్య పద్ధతుల గురించి అవగాహన కల్పించారు. జాతీయ ఆహార భద్రత పథకం కింద రైతులకు లభించే ప్రోత్సాహకాలను వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాజేశేఖర్, జ్యోత్స్న, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది బదిలీ

వెల్దండ: మండల కేంద్రంలోని లైన్‌మేన్లతో, ఇతర సిబ్బంది బదిలీపై వెళ్లినట్లు మంగళవారం ఏఈ సూర్యం నాయక్ తెలిపారు. వెల్దండ లైన్‌మేన్‌గా విధులు నిర్వహించిన విజేందర్ బదిలీపై ఊర్కొండకు, కల్వకుర్తి నుంచి వెల్దండ లైన్‌మేన్‌గా లక్ష్మణ్ నాయక్ బాధ్యతలు చేపట్టారు. అదే విధంగా తిమ్మినోనిపల్లి లైన్‌మేన్ యాదయ్య కొట్ర గ్రామానికి, కొట్ర లైన్‌మేన్ నాగేందర్ వంగూర్, చెర్కూర్ లైన్‌మేన్ కల్వకుర్తి మండలాలకు బదిలీపై వెళ్లారు. చారకొండ నుంచి బదిలీపై వచ్చిన శ్రీనివాసులు తిమ్మినోనిపల్లి లైన్‌మెన్‌గా, అచ్చంపేట నుంచి తిర్పతయ్యగౌడ్ చెర్కూర్ లైన్‌మెన్‌గా బాధ్యతలను స్వీకరించారు. లైన్ ఇన్‌స్పెక్టర్ రామచందర్‌నాయక్ నాగర్‌కర్నూల్, శ్రీనివాసులు కల్వకుర్తి బదిలీపై వెళ్లారు. కల్వకుర్తి నుంచి మాధవులు వెల్దండకు, తాడూర్ నుంచి లస్కర్ వెల్దండకు లైన్ ఇన్‌స్పెక్టర్లుగా బాధ్యతలను స్వీకరించారు. హెల్పర్లు ప్రవీణ్‌రెడ్డి, ఇమామ్‌గౌడు, ధర్మేందర్, విజయ్‌లు బదిలీపై కల్వకుర్తి మండలంలోని ఆయా గ్రామాలకు వెళ్లారు.

విద్యార్థుల సమస్యలపై రాజీ లేని పోరాటం

కల్వకుర్తి టౌన్/కల్వకుర్తిరూరల్: విద్యార్థుల సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తామని ఏబీవీపీ పాలమూరు విభాగ్ కన్వీనర్ నరేష్‌తేజ అన్నారు. మంగళవారం పట్టణంలోని కృష్ణవేణి జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థుల సమస్యలపై నిత్యం పోరాడుతూ, సమస్యల పరిష్కారానికి ఏబీవీపీ ఎప్పటికి ముందుంటుందన్నారు. 50 లక్షల మంది విద్యార్థులు సభ్యులుగా ఉన్నారని పేర్కొన్నారు. అనంతరం ఏబీవీపీ కల్వకుర్తి నగర కార్యదర్శిగా అక్కి వంశీగౌడ్‌ను నియమించారు. కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ శివశంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రశాంత్‌యాదవ్, మోహన్, లల్లూయాదవ్, ప్రశాంత్, నందీశ్వర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కల్లు శాంపిల్స్ సేకరణ

లింగాల: మండలంలోని రాంపూర్‌లో కల్తీ కల్లు విక్రయాలు జరుగుతున్నాయని ఆరోపణలు రావడంతో గ్రామంలో కల్లు విక్రయాలు కేంద్రాల నుంచి శాంపిల్స్ సేకరించినట్లు ఎక్సైజ్ సీఐ రమణయ్య మంగళవారం తెలిపారు. సత్యంగౌడు కల్లు వ్యాపారి కేంద్రంలో ఇటీవల కల్లు తాగిన ఓ మహిళ అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఎక్సైజ్ సూపరిండెంట్ ఆదేశాల మేరకు శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌లోని ల్యాబ్‌కు పంపించినట్లు సీఐ తెలిపారు. కల్తీ కల్లు అమ్మకాలు, అనుమతులు లేకుండా విక్రయాలు జరిపినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కల్వకుర్తి రూరల్: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం సాయంత్రం మండలంలోని గుండూరు శివారులో అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ మాధవ రెడ్డి తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ సైదులు, యజమాని రామచంద్రయ్యలపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కొనసాగుతున్న గాలింపు

లింగాల: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం ఎర్రపెంటకు చెందిన నిమ్మల శంకర్ అదృశ్యమై 25 రోజులు దాటినప్పటికి ఆచూకి లభ్యం కాలేదు. మంగళవారం పెంటకు చెందిన చెంచులు వర్షాన్ని లెక్క చేయకుండా అటవీ ప్రాంతంలో గాలింపు కొనసాగించారు. అదృశ్యమైన వ్యక్తికి భార్యతో పాటు ఐదుమంది పిల్లలు ఉన్నారని ప్రభుత్వం బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని చెంచులు కోరారు.

గుండెపోటుతో సీసీ మృతి

వంగూరు: మండలంలోని ఐకేపీలో పనిచేస్తున్న సీసీ నిర్మల(42) మంగళవారం గుండెపోటుతో మృతిచెందింది. ఆమెకు ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. ఆరు సంవత్సరాలుగా వంగూరు ఐకేపీలో సీసీగా పనిచేస్తుంది. ఆమె అకాల మరణం పట్ల ఏపీఎం చంద్రయ్యతోపాటు ఐకేపీ సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.

విద్యుదాఘాతంతో లైన్‌మేన్‌కు గాయాలు

చారకొండ: విద్యుదాఘాతంతో లైన్‌మేన్‌కు గాయాలైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం చారకొండ మండలం జూపల్లిలో విద్యుత్ లైన్‌మేన్‌గా అయూబ్ ఖాన్ విధులు నిర్వహిస్తున్నాడు. జూపల్లి గ్రామ శివారులో విద్యుత్‌స్తంభంపై మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైై గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

బాలకార్మికులకు విముక్తి

తెలకపల్లి: పర్వతాపూర్ గ్రామ శివారులో రైతు జంపల్లి మధుసూదన్‌రెడ్డి పొలంలో పని చేస్తున్న ముగ్గురు బాల కార్మికులను మంగళవారం చైల్డ్ లైన్ కోనేరు, కోనేరు సంస్థ సభ్యులు గుర్తించారు. బాలిక తల్లిదండ్రులను పిలిపించి బాలకార్మికులను అప్పగించారు. 18 సంవత్సరాల లోపు పిల్లలను పనికి పంపించడం చట్ట విరుద్ధమన్నారు. కార్యక్రమంలో చైల్డ్‌లైన్ కేస్ వర్కర్ కవిత, కౌన్సిలర్ యశ్వంత్, తెలకపల్లి హెడ్‌కానిస్టేబుల్ నారాయణ, కానిస్టేబుల్ లవకుశ, కోనేరు సంస్థ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఆంజనేయులు, అసిస్టెంట్ కోఆర్డినేటర్ శ్రీనివాసులు, జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్, పోస్టల్ శాఖ సేవలను వినియోగించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఆర్థిక అక్షరాస్యత కేంద్రం నిర్వాహకులు

లింగాల: బ్యాంక్, పోస్టల్ శాఖ సేవలను వినియోగించుకోవాలని సీఎఫ్ఎల్ జిల్లా కోఆర్డినేటర్ శేఖర్ రెడ్డి ప్రజలను కోరారు. లింగాల ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం మండల పరిధిలోని రాయవరంలో బ్యాంక్‌లు, పోస్టల్ శాఖ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, పీఎం సురక్షబీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సుకన్య సమృద్ధి తదితర పథకాల గురించి అవగాహన కల్పించారు. స్మార్ట్ ఫోన్ వినియోగిస్తున్న సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ భద్రత, డిజిటల్ లావాదేవీలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆయన ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు ఎండీ మన్సూర్, రూపేష్, శ్రీశైలం పాల్గొన్నారు.